

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 11 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 275 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

WEDNESDAY NOVEMBER 11 2026 | VOL:18 | ISSUE: 275 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని తీర్చిదిద్ది నియామకాలు చేపడుతున్నాం : సీఎం రేవంత్ రెడ్డి

సంక్లిష్టమైన పరిస్థితుల్లో డీఎస్పీల నియామకం చేపట్టాం

హైదరాబాద్, నవంబర్ 10 :

యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని తీర్చిదిద్ది నియామకాలు చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ నేపథ్యాన్ని మర్చిపోకుండా పని చేయండి. రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు రావడానికి మీ పనితీరే కీలకం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ, హైదరాబాద్ లో జరిగిన రెండవ బ్యాచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్-2025 ముగింపు వేడుకలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సంక్లిష్టమైన పరిస్థితుల్లో డీఎస్పీల నియామకం చేపట్టా మన్నారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసింది. 2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టారు.. ఆ తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లు తెలంగాణలో గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదన్నారు. కొన్ని నెలలు ఆలస్యమైతేనే ఏళ్లు కోల్పోయామన్న బాధ అనిపిస్తుంది. టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చినా ప్రశ్నాపత్రాలు, ఇతర అంశాల్లో జరిగిన గందరగోళం అందరికీ తెలుసు. మీరు ఆ రోజు బాధితులు. ఆనాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు,





నిర్లక్ష్యం చాలా మందికి కష్టనష్టాలు మిగిల్చింది.నేను ముఖ్యమంత్రి కాగానే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించాను. టీజీపీఎస్సీలో గతంలో సభ్యులుగా పనిచేసిన వారిలో ఆర్ఎంపీ డాక్టర్లు లాంటి వాళ్లు ఉన్నారన్నారు. ఉన్నత స్థాయిలో నియామకాలు చేపట్టే టీజీపీఎస్సీ బోర్డులో అంతకంటే కింది స్థాయి వాళ్లను, అవగాహన లేని వాళ్లను సభ్యులుగా నియమించడమే ప్రభుత్వ తప్పు. రాజకీయ పునరావాసానికి కేంద్రంగా టీజీపీఎస్సీ తయారైంది. యూపీఎస్సీ తీసుకుంటున్న విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని ఆ తరహాలో రూపొందించామని సీఎం చెప్పారు. యూపీఎస్సీకి స్వయంగా వెళ్లి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నాం. టీజీపీఎస్సీ మొదటి ఛైర్మన్‌గా రిటైర్డ్ డీజీ మహేందర్ రెడ్డిని నియమించాం. పోటీ పరీక్షలు నిర్వహించడంలో అనుభవం కలిగిన వాళ్లను, చిత్తశుద్ధి ఉన్నవాళ్లను బోర్డు సభ్యులుగా నియమించాం. భవిష్యత్తు నిర్ణయించే వ్యవస్థపై విశ్వాసం నన్నగిల్లితే నియామకాల పట్ల అపనమ్మకం ఏర్పడుతుంది. ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించాం. ఈ ప్రాంతం, విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉన్న అధికారి ఛైర్మన్‌గా ఉంటే భవిష్యత్తు బాగుంటుంది.563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది జాయిన్ అయ్యారు. 112 మంది డీఎస్పీల నియామకం చాలా పెద్ద విషయం. నియామకాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో పారదర్శకతను పాటించిందన్నారు.ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఉన్నారంటే మా పారదర్శకత అర్థమవుతుంది.ఈ నియామకాల పట్ల కొందరు పని గట్టుకుని ఎన్నో ఆరోపణలు చేశారు. అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. రాజకీయ ఆరోపణలు మాకు

అమ్మవారి మానవతా సేవలు ప్రపంచానికే ఆదర్శం : తెలంగాణ గవర్నర్

హైదరాబాద్ బ్రహ్మస్థానం మహోత్సవంలో సంక్షేమ సహాయ కార్యక్రమాలు అమృత గంగా తెలుగు సంచిక ఆవిష్కరణ

హైదరాబాద్, నవంబర్ 10 :

మానవ సేవే మాధవ సేవ అనే సందేశాన్ని తన సేవా కార్యక్రమాల ద్వారా మాతా అమృతానందమయి దేవి (అమ్మ) ప్రపంచానికి చాటిచెబుతున్నారని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్ బ్రహ్మస్థానం మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ, వసుధైవ కుటుంబకం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భారతీయ సంస్కృతి గొప్ప సందేశాన్ని అమ్మ తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నారని కొనియాడారు. యువతలో నైతిక విలువలను పెంపొందించేందుకు అమ్మ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. విలువలతో కూడిన యువతను తీర్చిదిద్దడంలో అమ్మ కృషి ఆచరణాత్మక ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సనాతన ధర్మానికి అమ్మ ప్రపంచ వేదికపై ఒక గొప్ప స్వరంగా నిలిచారని అన్నారు. భారతీయ సాంస్కృతిక విలువల ఆధారంగా సమాజ నిర్మాణానికి అమ్మ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ చిన్మయ మిషన్ అధిపతి స్వామి సర్వేశానంద సరస్వతి తదితరులు పాల్గొన్నారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు పూలమాలలతో అమ్మకు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా అమ్మ మాట్లాడుతూ, ప్రకృతి నుంచి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవాలని, మనుషుల మధ్యనే కాకుండా ప్రకృతితో కూడా సహకారం, సామరస్య భావనను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచ పురోగతి, సర్వజన సంక్షేమానికి ఈ సామరస్యం ఎంతో అవసరమని అన్నారు.అమృతశ్రీ సభ్యులకు వస్త్రాలు, ఆర్థిక సహాయం అందించడంతో పాటు దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. అమ్మ సందేశాలు, దేశవిదేశీ పర్యటనలు, భజనలతో కూడిన అమృత గంగా కార్యక్రమం తెలుగు సంచికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.అనంతరం అమ్మ భజనలు, ధ్యాన కార్యక్రమాలకు నేతృత్వం వహించి భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రత్యేక పూజలతో నిర్వహించిన ఈ మహోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు.



ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ

కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్

భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ (AVGC-XR) పాలసీ 2026-31, ఏపీ రోబోటిక్స్ – ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్

(మిగతా 3వ పేజీలో..)



తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత.. 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తీవ్ర చలిగాలులు

కొన్ని జిల్లాల్లో 12 డిగ్రీల వరకు పడిపోనున్న రాత్రి ఉష్ణోగ్రతలు

ఈశాన్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులే ఉష్ణోగ్రతల పతనానికి కారణం

తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు

2



ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత

వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన వైనం

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన

(మిగతా 2వ పేజీలో..)



ఉత్తర భారతాన్ని కమ్మేసిన విషపూరిత పొగమంచు.. బయటపెట్టిన ఉపగ్రహ చిత్రాలు

నాసా శాటిలైట్ చిత్రాల్లో ఉత్తర భారతాన్ని కమ్మేసినట్లు కనిపించిన దట్టమైన పొగమంచు

ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ సహా హిమాలయ ప్రాంతాలకూ విస్తరించిన స్మాగ్ ప్రభావం

దీపావళి తర్వాత మూడు రోజులుగా ఆకాశాన్ని కప్పేసిన బూడిద రంగు పొగ తెర

రాజస్థాన్, గుజరాత్, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణంగానే ఉన్న వాతావరణం

గాలుల వేగం పెరగడంతో ఢిల్లీలో 299 పాయింట్లకు తగ్గిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

2



జనరల్ న్యూస్

విజయకేరళం
తెలుగు దినపత్రిక

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

(మొదటి పేజీ తరువాయి)

మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత.. 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా పడిపోతుండటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం... జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని, అక్కడ ఉష్ణోగ్రతలు దాదాపు 12 డిగ్రీల వరకు పడిపోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలోని నేరెడుగొండలో అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డైంది.దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తక్కువ ఎత్తులో వీస్తున్న చల్లని గాలుల ప్రభావం వల్లే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ మూడు రోజుల పాటు తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకునే అవకాశముంది. దీనివల్ల దృశ్యమానత (విజిబిలిటీ) తగ్గి రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, అటవీ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఉదయం వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఐ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

ధైర్యంగా కోలుకుంటోంది.. రాప్తాడు బాలిక ఆరోగ్యంపై లోకేశ్ ట్వీట్

రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో మానసిక రోగి దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు నిర్వహించిన ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రస్తుతం బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, బాధితురాలు వేగంగా కోలుకుంటోందని ఆయన తెలిపారు.వైద్యులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గాయాలకు సంబంధించిన డీబ్రిడ్‌మెంట్, కుట్లను సరిచేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని లోకేశ్ పేర్కొన్నారు. బాలిక గాయాలు క్రమంగా నయమవుతున్నాయని, ఎడమ చేతికి ఉన్న స్లింగ్‌ను తొలగించడంతో ఆమె నెమ్మదిగా చేతిని కదిలిస్తోందని చెప్పారు. ఆ చిన్నారి ఎంతో ధైర్యంతో చికిత్సకు సహకరిస్తోందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆమెకు నొప్పి నివారణ మందులు, ఫీడింగ్ సపోర్ట్ అందిస్తున్నారని.. త్వరలోనే పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) నుంచి జనరల్ వార్డుకు మార్చుతారని మంత్రి పేర్కొన్నారు.



యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని తీర్చిదిద్ది నియామకాలు చేపడుతున్నాం : సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కొత్త కాదు.. కానీ మీకు చాలా ఆందోళన కలిగించాయి.ఈ అవకాశం కూడా జారిపోతుందేమోనని ఆందోళన చెందారు.డీఎస్పీల తరఫున సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లింది. నిష్ణాతులైన న్యాయవాదులతో వాదించి డీఎస్పీల నియామకాన్ని సాధించాం. నాలెడ్జ్, చిత్తశుద్ధి, అంకితభావం మీ అందరినీ ఇక్కడ కూర్చోబెట్టింది. మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దు. మన నేపథ్యాన్ని మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేం. మీరు ఏ ఉద్దేశంతో పోలీస్ శాఖలో చేరారో దాన్ని మరిచిపోవద్దన్నారు. లక్ష్యం పెట్టుకుని ప్రయత్నం చేస్తే అసాధ్యం ఏదీ ఉండదు.. చరిత్రలో చాలా మంది ఉన్నారు.లక్ష్యం పెట్టుకుని కష్టపడ్డారు కాబట్టే ఈ హోదాకు చేరుకున్నారు.ఇక ముందు రెండో అధ్యాయం ప్రారంభం కాబోతుంది.. ఇది మీ జీవితాల్లో చాలా ముఖ్యం. వచ్చే ముప్పై ఏళ్లు తెలంగాణ భవిష్యత్తును ఏ దిశగా నడిపించాలో అది మీ చేతుల్లోనే ఉంది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే పెద్ద హోదా మీది. మీ ఫీడ్‌బ్యాక్, నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతుంది. మీరు నిటారుగా నిలబడి డ్యూటీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. నిజాయితీగా డ్యూటీ చేయాలి, బాధ్యతను గుర్తించి పనిచేయాలని ప్రభుత్వం కోరుకుంటోందని అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా మొదట గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థ. తల్లిదండ్రుల కంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థ.సర్వం ఒడ్డి శాంతిభద్రతలను కాపాడారు కాబట్టే ప్రజలు పోలీసు వ్యవస్థను విశ్వసిస్తున్నారు. అనేక మంది సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా పనిచేయడం వల్లనే సమాజంలో పోలీసు వ్యవస్థకు గుర్తింపు వచ్చింది.. దాన్ని మీరు కాపాడాలి. మీ హోదాను ఎంత జాగ్రత్తగా ప్రజల కోసం వాడితే అంత బాగుంటుందన్నారు. అతిగా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడితే దీర్ఘకాలికంగా ఉండదు. సమస్యను పరిష్కరించాలంటే ఆ సమస్యను ముందుగా అర్థం చేసుకోవాలి. సమస్యను వినాలి, అర్థం చేసుకోవాలి.. అప్పుడే పరిష్కారం పెద్ద విషయం కాదు. సమస్య పరిష్కారంలో సమయం, రిసోర్సెస్, టెక్నికల్ సపోర్ట్ అత్యంత ముఖ్యం.బాధితులు వచ్చినప్పుడు కూర్చోబెట్టి వాళ్లతో ప్రేమపూర్వకంగా మాట్లాడాలి.. అప్పుడే సమస్య అర్థం చేసుకోగలుగుతారు.రాజ్యాంగం రాసే సమయంలో దేశంలో అత్యాచారాలు, హత్యలు, ఆహార కొరత అనే మూడు సమస్యలు అధికంగా ఉన్నాయి.పీవీ నరసింహారావు ఓపెన్ ఎకానమీ తీసుకువచ్చిన తర్వాత ప్రపంచంలోని అన్ని సమస్యలు మన దగ్గరకు వచ్చాయి. అందులో ముఖ్యమైనవి సైబర్ క్రైమ్.. వ్యక్తుల మధ్య పరిచయం లేకుండా, కనీసం చూడకుండా సర్వం దోచుకునే పరిస్థితి సైబర్ క్రైమ్‌లో ఉంది. ఇప్పుడు నేరాలు, వాటి ప్రవృత్తి మారిపోయింది.డ్రగ్స్ సరఫరాను నియంత్రించడంలో యుద్ధవీరులను ఇచ్చిన పంజాబ్ కూడా విఫలమైంది. సిక్కు రెజిమెంట్‌లో ఇప్పుడు సిక్కులు లేరు. బ్రిటీషర్లు కూడా భయపడిన సిక్కు జాతి డ్రగ్స్ విషయంలో నిర్వీర్యమైంది. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్‌ను తీసుకువచ్చి అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్, డ్రగ్స్ కంట్రోల్, సైబర్ క్రైమ్‌ల కోసం సరికొత్త వ్యవస్థలను తీసుకువచ్చాం. అవసరమైతే నూతన డీఎస్పీలను అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తాం. విద్యా ప్రమాణాల అధ్యయనం కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తున్నాం. డీఎస్పీలు తమ ఫిట్‌నెస్‌పై మరింత ఫోకస్ పెట్టాలి. గరం, నరం, బేషరమ్ పరిస్థితి మీకు ఎదురుకావొద్దని నేను కోరుకుంటున్నానని అన్నారు.

ఉత్తర భారతాన్ని కమ్మేసిన విషపూరిత పొగమంచు.. బయటపెట్టిన ఉపగ్రహ చిత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర భారతదేశంలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. దీపావళి పండుగ ముగిసిన రెండు రోజుల తర్వాత కూడా ఉత్తరాదిలోని అత్యధిక ప్రాంతాలను దట్టమైన పొగమంచు (స్మాగ్) కమ్మేసింది. అంతరిక్షం నుంచి తీసిన ఉపగ్రహ చిత్రాల్లో ఈ కాలుష్య మేఘాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నాసా వరల్డ్‌వ్యూ తాజా చిత్రాల ద్వారా వెల్లడైంది. నాసా విడుదల చేసిన నవంబర్ 10 చిత్రాల ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, వాటి సమీప రాష్ట్రాల్లో ఈ పొగమంచు ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. ఇది మైదాన ప్రాంతాలకే పరిమితం కాకుండా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ వంటి హిమాలయ పర్వత ప్రాంతాల వరకు విస్తరించింది. మరోవైపు మధ్య, దక్షిణ భారతదేశంలోనూ దీని ప్రభావం కొంతమేర కనిపించినప్పటికీ, తీవ్రత తక్కువగానే ఉంది. అయితే రాజస్థాన్, గుజరాత్ వంటి పశ్చిమ రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో వాతావరణం చాలావరకు నిర్మలంగా ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి.దీపావళి నాటి నుంచి దేశంలోని వాయు పరిస్థితులను పరిశీలిస్తే గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. నవంబర్ 8న పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లతో పాటు ఇతర ఉత్తరాది ప్రాంతాలను దట్టమైన పొగ కప్పేసింది. నవంబర్ 9 నాటికి ఈ పొగ కొంత పలుచబడి పలు ఉత్తరాది రాష్ట్రాలు, బీహార్, పర్వత ప్రాంతాల మీదుగా విస్తరించింది. ఇక నవంబర్ 10 నాటికి ఇది మరింత విస్తృతమై, దేశంలోని విశాల భూభాగాన్ని దట్టమైన బూడిద రంగు దుప్పటిలా కప్పేసినట్లు నమోదైంది.శీతాకాలం ప్రారంభం కావడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పాటు వాతావరణ పరిస్థితుల వల్ల కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. దీనికి తోడు పొలాల్లో వ్యర్థాలు తగులబెట్టడం (స్టబుల్ బర్నింగ్), బాణసంచా పొగ, వాహనాల నుంచి వచ్చే ఉద్గారాలు తోడవ్వడంతో నవంబర్ మొదటి వారం నుంచే కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఈ తీవ్ర పరిస్థితుల నడుమ దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత స్వల్పంగా మెరుగుపడటం కొంత ఊరటనిచ్చింది. మంగళవారం గాలుల వేగం పెరగడంతో ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 299 వద్ద నమోదైంది. అంతకుముందు రోజు ఇది 376 పాయింట్లతో "చాలా తీవ్రమైన" (వెరీ పూర్) కేటగిరీలో ఉండగా, తాజాగా "పూర్" విభాగానికి చేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (CPCB) నిబంధనల ప్రకారం ఏక్యూఐ 201 నుంచి 300 మధ్య ఉంటే 'పూర్' అని, 301 నుంచి 400 మధ్య ఉంటే 'వెరీ పూర్'గా పరిగణిస్తారు. ప్రస్తుతానికి గాలి నాణ్యత కాస్త మెరుగైనప్పటికీ, కాలుష్య ప్రభావం ఇంకా కొనసాగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

నక్సల్ రహిత భారత్ తర్వాత ఇదే మన ప్రధాన లక్ష్యం: అమిత్ షా

- 2028 డిసెంబర్ 31 నాటికి డ్రగ్స్ రహిత గుజరాత్ లక్ష్యమన్న అమిత్ షా
- దేశవ్యాప్తంగా 2029 నాటికి డ్రగ్ ఫ్రీ ఇండియా సాధన
- డ్రగ్స్ సమాచారం కోసం డిసెంబర్ 1 నుంచి హెల్ప్‌లైన్ 1033
- అహ్మదాబాద్‌లో రూ.1,400 కోట్ల పనులను ప్రారంభించిన అమిత్ షా
- మాదకద్రవ్యాల నిరోధానికి ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి

2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత (డ్రగ్ ఫ్రీ) రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందిన వారం కావడంతో రాష్ట్రం ఏడాది ముందే ఈ లక్ష్యాన్ని అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. వీటిలో ఇస్కాన్-సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి '1033' టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధి, తులకు చికిత్స అందించేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా మని, వారి వివరాలు కూడా బయటకు రానివ్వమని ఆయన స్పష్టం చేశారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక
నవంబర్ | బుధవారం | 11 | 2026

అమెరికాలో అదృశ్యమైన నల్లగొండ యువతి.. ఆచూకీ కోసం మంత్రి కోమటిరెడ్డి నిరంతర ప్రయత్నాలు

- బోస్టన్ పోలీసులతో సమన్వయం.. తానా ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు

నల్గొండ, నవంబర్ 10 (విజయ కెరటం):

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న నల్లగొండకు చెందిన కోయ శ్రీజా రెడ్డి అదృశ్యమైన ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న శ్రీజా ఆచూకీ కనుగొని, క్షేమంగా స్వదేశానికి తీసుకురావడానికి నిరంతరం సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు.ఇప్పటికే బోస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఈ-మెయిల్స్ ద్వారా విజ్ఞప్తి చేశారు. తాజాగా బోస్టన్‌లోని తానా ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి, స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను వేగవంతం చేయాలని కోరారు.మంత్రి విజ్ఞప్తి మేరకు స్థానిక పోలీసుల సహకారంతో శ్రీజ ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని కృష్ణప్రసాద్ వివరించారు. ఇప్పటికే బోస్టన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకునేందుకు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.శ్రీజ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్న నేపథ్యంలో ఆమె ఆచూకీ లభించే వరకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించాలని బోస్టన్ కాన్సులేట్ జనరల్‌ను మంత్రి కోరారు. మరోవైపు మంత్రి కార్యాలయం నుంచి ప్రతి గంటకోసారి సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ దర్యాప్తు పురోగతిని



తెలుసుకుంటున్నారు. శ్రీజ క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు, తానా ప్రతినిధులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి





- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 10 (విజయ కెరటం):

రైతులు భూముల నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను ఎంచుకోవడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత లేకుండా చూసి కొనుగోళ్లు, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మంగళవారం అనుముల మండలం పులిమామిడి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులు, సంఘబంధం సభ్యులు, హమాలీలను గన్నీ బ్యాగుల లభ్యత, కొనుగోళ్ల రికార్డులు, సీరియల్ నంబర్ల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 64 మంది రైతులు ధాన్యం తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీరియల్ నంబర్ల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, మద్దతు ధర వివరాలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు గంగయ్యను ధాన్యం తీసుకువచ్చి ఎన్ని రోజులైందని, సీరియల్ నంబర్ ఎంతని అడిగి తెలుసుకున్నారు. తనకు 13వ సీరియల్ నంబర్ వచ్చిందని రైతు తెలిపారు. కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగులను వెంటనే సరఫరా చేయాలని, లారీలను పంపించి ధాన్యాన్ని త్వరగా లోడింగ్ చేయించాలని, హమాలీలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్రంలో జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా పరిశీలించారు.అనంతరం రైతులతో

మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. రెండు ఎకరాల భూమి ఉన్న రైతులు అవసరాన్ని బట్టి ఒక ఎకరంలో మాత్రమే వరి సాగు చేసి, మిగిలిన భూమిలో తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. సన్నరకం వరి సాగు చేసే రైతులు ప్రభుత్వం సూచించిన రకాలను ఎంపిక చేసుకోవాలని, రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కుసుమ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కలెక్టర్ కోరారు. గ్రామంలో కుసుమ పంటకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామపంచాయతీ పరిధిలోనే మార్కెట్ ఏర్పాటు చేయడంతో పాటు పంట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. రైతులు సంఘటితంగా ఏర్పడి సామూహిక వ్యవసాయం చేపడితే మరింత ప్రయోజనం పొందవచ్చని సూచించారు.గ్రామంలో సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, పాత వైరింగ్‌ను మార్చి సౌర విద్యుత్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని సర్పంచ్ తెలపగా, గ్రామపంచాయతీ నిధులతో కోతులను పట్టించి నల్లమల అడవుల్లో వదిలేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి మొదటి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని సర్పంచ్‌కు తెలిపారు.భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేందుకు రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ అరుణ, సత్యనారాయణ రెడ్డి, ఏఈఓ మహేష్, జీపీఓ స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నీటి సంరక్షణ వారియర్‌గా ఎదగాలి

ఫిట్‌నెస్, ఆరోగ్యం, చదువుకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 10 (విజయ కెరటం):

ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి పొదుపు సూత్రాలను పాటించేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ప్రతి విద్యార్థి నీటి సంరక్షణలో ఒక వారియర్‌గా ఎదగాలని, ఫిట్‌నెస్, ఆరోగ్యం, చదువు అనే మూడు అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.మంగళవారం అనుముల మండలం హాలియాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నీటి వినియోగంపై ఆరా తీశారు. మంచినీటిని వృథా చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. వృథాగా వెళ్లే నీటిని తిరిగి వినియోగించుకునేందుకు డ్రై డ్రెయిన్, సోక్‌పిట్ ఏర్పాటు చేయాలని, ఎస్ఎస్ కమిటీ ద్వారా తీర్మానం చేయిస్తే కలెక్టర్ నిధుల నుంచి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అవసరమైనంత నీటినే వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.అనంతరం ఆరో తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ పాఠ్యాంశాలను చదివించి ప్రశ్నలు అడిగారు. హిందీ భాషపై ఆసక్తి పెంపొందించేందుకు విద్యార్థినులతో బోర్డుపై హిందీ అక్షరాలు రాయించి పరిశీలించారు. చక్కగా రాసిన వారిని అభినందించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి విద్యార్థిని పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, స్టేజ్ ఫియర్ పోగొట్టుకునేలా అందరికీ మాట్లాడే అవకాశం కల్పించాలని సూచించారు. ప్రార్థన సమయంలో సూక్తులు, జనరల్ నాలెడ్జ్, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని, వారంలో రెండుసార్లు నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు కలెక్టర్ హిందీలో కవిత వినిపించి ప్రోత్సహించారు. ఈరోజు చేయాల్సిన పనిని ఇప్పుడే, రేపు చేయాల్సిన పనిని ఈరోజే పూర్తి చేయాలనే సందేశాన్ని ఇచ్చారు. ఎలాంటి భయాలు లేకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని తెలిపారు.విద్యార్థినులకు యూనిఫాంలు, షూస్ అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థినికి జనన, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు ఉండేలా చూడాలని, లేని వారికి మీ సేవ ద్వారా దరఖాస్తు చేయించి అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతలను విద్యార్థినుల్లో



పెంపొందించాలని, పాఠశాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కుకడాల హైమావతి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ హాకీ జట్టుకు ఎంపికైన గణేష్‌కు గుత్తా అమిత్ రెడ్డి ప్రోత్సాహం!

- హాకీ బ్యాట్ కొనుగోలుకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేత

నల్గొండ, నవంబర్ 10 (విజయ కెరటం):



నల్గొండ పట్టణానికి చెందిన యువ హాకీ క్రీడాకారుడు రావుల గణేష్ జాతీయ హాకీ జట్టుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అతడిని ప్రోత్సహిస్తూ హాకీ బ్యాట్ కొనుగోలు నిమిత్తం రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేశారు.యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్, నల్గొండ జిల్లా హాకీ కోచ్ అన్వర్ అలీ, పీఏ రాంప్రసాద్, మాదగోని కృష్ణ, మాగంటి రాఘవరావు, జక్కుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు.. 1930కు ఫిర్యాదు చేయండి

నల్గొండ, నవంబర్ 10 (విజయ కెరటం):



జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు ఎస్పీ జి. రమేష్, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ టి. లక్ష్మీనారాయణతో కలిసి ఆవిష్కరించారు.'ప్రొటెక్ట్ యువర్ ఐడెంటిటీ' (మీ వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోండి) అనే సందేశంతో రూపొందించిన పోస్టర్ల ద్వారా ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు అధికారులు, కస్టమర్ కేర్ సిబ్బంది లేదా ప్రభుత్వ అధికారులమని ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతాల వివరాలు వెల్లడించవద్దని సూచించారు.అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా 'ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించుకోండి' అనే సూత్రాన్ని పాటించాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ వాట్సాప్ నంబర్ 8712672222ను కూడా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డీ4సీ ద్వారా నిరంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు.ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు తొలి రక్షణ.

బోడా డిన్నకు టీపీసీసీ అధికార ప్రతినిధిగా కీలక బాధ్యతలు!

- పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి -- డీసీసీ అధ్యక్షుడు అయూబ్
- కాంగ్రెస్ గళాన్ని బలంగా వినిపిస్తా -- బోడా డిన్న

వరంగల్, నవంబర్ 10 విజయ కెరటం :



కాంగ్రెస్ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధిగా బోడా డిన్న నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. మంగళవారం వరంగల్‌లోని వెంకట్రామ జంక్షన్ వద్ద ఉన్న లక్ష్మీపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన బోడా డిన్న, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయూబ్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ ఆశయాలను, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి బోడా డిన్న కృషి చేయాలని, జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.అనంతరం బోడా డిన్న మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో టీపీసీసీ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాషిపాక సదానందం, కొత్తపల్లి శ్రీనివాస్, మొహమ్మద్ కమలుద్దీన్, ఎర్రం కమల్ తదితరులు పాల్గొని బోడా డిన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌కు ఎంపీ రవిచంద్ర దీపావళి శుభాకాంక్షలు

- తెలంగాణ భవన్‌లో ఆత్మీయ పలకరింపు.. మిఠాయిలతో పండుగ సందడి

హైదరాబాద్, నవంబర్ 10 (విజయ కెరటం):



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే. తారక రామారావును రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆత్మీయంగా కలుసుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రవిచంద్ర మిఠాయిలు అందజేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలతో పాటు పరస్పర ఆత్మీయ పలకరింపులు, ఆనందభరిత సంభాషణలు చోటుచేసుకున్నాయి. దీపావళి వెలుగులు ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని రవిచంద్ర ఆకాంక్షించారు. పండుగల సందర్భంగా ఆత్మీయతను పంచుకోవడం, పరస్పర స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.కేటీఆర్‌ను కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా రవిచంద్ర తన ఆత్మీయతను చాటుకున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించింది.

విజయకేరటం
తెలుగు దినపత్రిక

‘ఇట్లు అర్జున’ చిత్రానికి సెన్సార్ పూర్తి.. విడుదలకు సిద్ధం

‘ఇట్లు అర్జున’ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి ‘యూ/ఏ’ సర్టిఫికెట్

నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న సినిమా

ఈ చిత్రాన్ని సమర్పిస్తున్న అక్కినేని నాగార్జున, నిర్మిస్తున్న వెంకీ కుడుముల

హీరోగా అనీశ్ పరిచయం, కథానాయికగా అనశ్వర రాజన్

చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్



హీరో అనీష్, కథానాయిక అనశ్వర రాజన్ జంటగా నటించిన తాజా రొమాంటిక్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఇట్లు అర్జున’. మహేశ్ ఉప్పాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి క్లియరెన్స్ లభించింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ‘యూ/ఏ’సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ‘వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్’ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది.నిజానికి ఈ చిత్రం అక్టోబర్ 30నే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ప్రస్తుతం సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి కావడంతో, ఈ చిత్రాన్ని నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.ఈ సినిమాకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉండటానికి ప్రధాన కారణం దీని నిర్మాణ భాగస్వామ్యం. ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుముల ‘వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్’ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించగా, స్టార్ హీరో అక్కినేని నాగార్జున ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఈ చిత్రంతో అనీష్ హీరోగా వెండితెరకు పరిచయమవుతుండగా, మహేశ్ ఉప్పాల దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు.ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. కథ ప్రకారం.. కథానాయకుడు అర్జున్ (అనీష్) మాట్లాడలేని దివ్యాంగుడైనప్పటికీ, చోరీలలో ఎంతో నేర్పరి. నగరంలో జరిగిన ఓ పెద్ద దొంగతనం కేసులో పోలీసులు అతడి కోసం గాలిస్తుంటారు. మరోవైపు, చదువే లోకంగా భావించే క్రమశిక్షణ గల అమ్మాయి కీర్తి (అనశ్వర రాజన్)తో అర్జున్ ప్రేమలో పడతాడు. అర్జున్ మంచివాడనే నమ్మకంతో కీర్తి కూడా అతడిని ఇష్టపడుతుంది. అయితే ఊహించని రీతిలో సుమారు రూ. 1000 కోట్లకు సంబంధించిన ఓ పెన్ డ్రైవ్ వ్యవహారంలో ఒక ప్రమాదకరమైన ముఠా అర్జున్, కీర్తిల వెంటపడుతుంది. అటు పోలీసులు, ఇటు నేర ముఠా ఇద్దరూ వీరిని వెంటాడే క్రమంలో ఏం జరిగింది అనే ఉత్కంఠభరిత కథనంతో సినిమా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.ఈ సినిమాకు ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులు పనిచేశారు. సౌత్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు. రాజా మహదేవ్ సినిమాటోగ్రఫీ అందించగా, రామ్ కుమార్ ఎ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కోటి కె ఎడిటింగ్ చేయగా, దిలీప్ సుబ్బరాయన్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేశారు. నవంబర్ 13న రానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

ఓవైపు పవన్ విడాకుల వార్తల హోరు.. మరోవైపు రేణు దేశాయ్ ఇన్స్టాగ్రామ్ పోస్ట్ వైరల్!

దీపావళి తర్వాత కూడా అర్ధరాత్రి టపాసులు పేల్చడంపై రేణూ దేశాయ్ ఆగ్రహం

శబ్దాల వల్ల పసిపిల్లలు, వృద్ధులు, రోగులు ఇబ్బంది పడతారని ఆవేదన

తాత్కాలిక ఆనందం కోసం ఇతరులను బాధపెట్టడం స్వార్థమంటూ వ్యాఖ్య

నటి రేణూ దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే, ఈసారి వ్యక్తిగత విషయాల వల్ల కాకుండా, ఒక సామాజిక అంశంపై తనదైన శైలిలో స్పందించి అందరి దృష్టిని ఆకర్షించారు. దీపావళి పండుగ ముగిసి రోజులు గడుస్తున్నా, కొందరు ఇంకా అర్ధరాత్రి వేళల్లో టపాసులు పేల్చడంపై ఆమె తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇన్స్టాగ్రామ్‌లో ఆమె పెట్టిన పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.గత మూడు రోజులుగా రాత్రి 11 గంటలకు కూడా టపాసులు కాలుస్తున్నారని, తన స్నేహితులు చెప్పిన ప్రకారం కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి 1, 2, 3 గంటల వరకు కూడా ఈ శబ్దాలు కొనసాగుతున్నాయని రేణూ దేశాయ్ తన పోస్టులో పేర్కొన్నారు. “అసలు ఏ పండుగ కోసం ఈ సంబరాలు? దయచేసి రాత్రి 9 గంటలకు, మహా అయితే 10 గంటలకల్లా ఈ వేడుకలు ముగించండి” అని ఆమె విజ్ఞప్తి చేశారు. తన ఆందోళన పర్యావరణం గురించి కాదని, సాటి మనుషుల పట్ల సానుభూతితో ఆలోచించాలని ఆమె స్పష్టం చేశారు.ఈ భారీ శబ్దాల వల్ల నవజాత శిశువులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని రేణు దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. “కొద్దిసేపటి తాత్కాలిక ఆనందం కోసం ఇతరుల బాధను, కష్టాన్ని పట్టించుకోనంత స్వార్థపరులుగా, మూర్ఖులుగా మనం మారిపోయాం” అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. దీపావళి రోజున తాను ఈ విషయంపై మాట్లాడితే ‘హిందూ వ్యతిరేకి’ అనే ముద్ర వేస్తారనే ఉద్దేశంతోనే మౌనంగా ఉన్నానని ఆమె వివరించారు. ఏపీ డిప్యూటీ సీఎం, తన మాజీ భర్త పవన్ కల్యాణ్ తన మూడో భార్య అన్నా లెజినోవాతో విడాకుల వార్తలు ఓవైపు హోరెత్తుతుండగా, మరోవైపు రేణూ దేశాయ్ ఈ సామాజిక అంశంపై పోస్ట్ చేయడం గమనార్హం. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తల మధ్య, ఆమె ఒక సామాజిక బాధ్యతతో చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. పండుగల పేరుతో శబ్ద కాలుష్యం సృష్టించడంపై మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని రేణూ దేశాయ్ పోస్ట్ గుర్తుచేసింది.



బేబీ బంప్ లేటెస్ట్ ఫొటో షేర్ చేసిన సమంత.. నెట్టింట వైరల్



హంగూ ఆర్భాటం లేకుండా చాలా సింపుల్‌గా మెటర్నిటీ ఫొటోషూట్

గతేడాది డిసెంబర్ 1న రాజ్ నిడిమోరును పెళ్లాడిన స్టార్ నటి

ఇటీవలే కోయంబత్తూరు ఈశా ఫౌండేషన్‌లో సంప్రదాయబద్ధంగా సీమంతం

కొత్త జీవితాన్ని ఆస్వాదించేందుకు తాత్కాలికంగా సినిమాలకు విరామం

ప్రముఖ నటి సమంత త్వరలోనే మాతృత్వపు మధురిమలను ఆస్వాదించబోతున్నారు. భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తమ మొదటి సంతానాన్ని ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్న ఆమె, తన ప్రెగ్నెన్సీ ప్రయాణానికి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటున్నారు.తాజాగా సమంత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బేబీ బంప్‌తో ఉన్న ఒక సరికొత్త ఫొటోను పోస్ట్ చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు మెటర్నిటీ సమయంలో భారీ సెట్టింగులు, డిజైనర్ డ్రెస్సులతో గ్రాండ్‌గా ఫొటోషూట్‌లు చేస్తుంటారు. అయితే సమంత మాత్రం ఎంతో భిన్నంగా, సాధారణ వాతావరణంలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఇంట్లోని సోఫాపై ప్రశాంతంగా కూర్చుని సేదతీరుతున్న ఒక క్యాజువల్ ఫొటోను ఆమె పంచుకున్నారు. రెడ్ కలర్ టాప్, వైట్ ట్రౌజర్ ధరించి, బ్లాక్ సన్‌గ్లాసెస్‌తో చాలా కూల్‌గా ఉన్న లుక్‌లో బేబీ బంప్‌ను సున్నితంగా పట్టుకుని ఆమె కనిపించారు. ఈ ఫొటోకు “దీనినే నా మెటర్నిటీ షూట్‌గా భావించండి” అంటూ ఒక సరదా క్యాప్షన్ జోడించారు.సమంత పోస్ట్ చేసిన ఈ ఫొటో కొద్దిసేట్లోనే నెట్టింట వైరల్‌గా మారింది. అభిమానులు, నెటిజన్లు పెద్ద సంఖ్యలో స్పందిస్తూ ఆమెపై ప్రేమను కురిపించారు. “ఇప్పటివరకు చూసిన వారిలో అత్యంత కూలెస్ట్ కాబోయే తల్లి” అని ఒక అభిమాని ప్రశంసించగా.. “పుట్టబోయే బిడ్డ ఇప్పుడే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది”, “త్వరలోనే జూనియర్ సమంత రాబోతోంది” అంటూ పలువురు నెటిజన్లు కామెంట్ల రూపంలో తమ శుభాకాంక్షలు తెలిపారు.సమంత, రాజ్ నిడిమోరుల వివాహం 2025 డిసెంబర్ 1న కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగింది. ఈ క్రమంలోనే కొన్ని వారాల క్రితం ఈ దంపతులు కోయంబత్తూరు ఈశా ఫౌండేషన్‌లోనే సంప్రదాయ పద్ధతిలో సీమంతం వేడుకను కూడా నిర్వహించారు. అంతకుముందు, 2026 జూన్‌లో హైదరాబాద్‌లో జరిగిన ‘మా ఇంటి బంగారం’ సినిమా సక్సెస్ మీట్ వేదికగా సమంత తన ప్రెగ్నెన్సీ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అప్పటికే అంగీకరించిన ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత, జీవితంలో ఎదురవుతున్న ఈ అద్భుతమైన కొత్త దశను ఆస్వాదించేందుకు కొంతకాలం పాటు సినిమాలకు దూరంగా ఉండనున్నట్లు ఆమె వెల్లడించారు. అయితే ఇది కేవలం తాత్కాలిక విరామం మాత్రమేనని, మాతృత్వపు బాధ్యతలను స్వీకరించిన అనంతరం మళ్లీ వెండితెరపైకి రీఎంట్రీ ఇస్తానని సమంత స్పష్టం చేశారు.

“రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నా”.. పొలిటికల్ ఎంట్రీపై హీరో సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు

రాజకీయ ప్రవేశంపై స్పందించిన హీరో సూర్య

ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టీకరణ

రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నానని వెల్లడి

అవగాహన లేకుండా రాజకీయాల్లోకి రానని వ్యాఖ్య

అగరం ఫౌండేషన్‌తో విద్యార్థులకు ఉన్నత చదువుల్లో సాయం

తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంతో మరో హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై చర్చ మొదలైంది. ఆయన కూడా రాజకీయాల్లోకి వస్తారా? విజయ్ బాటలో నడుస్తారా? అంటూ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ ప్రశ్నలకు సూర్య స్వయంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు.చెన్నైలో జరిగిన తన తాజా చిత్రం ‘సీన్’ విజయోత్సవ కార్యక్రమంలో సూర్య ఈ విషయంపై మాట్లాడారు. రాజకీయాల్లోకి రావడం లేదని చెబుతూనే.. రాజకీయాలంటే తనకు ద్వేషం లేదని పేర్కొన్నారు. రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నానని చెప్పారు. ఆ రంగంపై పూర్తిస్థాయి అవగాహన, బాధ్యతల గురించి తెలుసుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టబోనని స్పష్టం చేశారు.సూర్య రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు సాయం చేస్తున్న ఆయన ‘అగరం ఫౌండేషన్’ సేవా కార్యక్రమాలు ఈ చర్చకు కారణమయ్యాయి.సూర్య నటించిన ‘సీన్’ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. జీతు మాధవన్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ కామెడీ చిత్రంలో నజ్రియా నజీమ్, మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 6న విడుదలైన ఈ సినిమా తొలి మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.116 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సాక్‌నిల్క్ వెల్లడించింది. భారత్‌లో నెట్ వసూళ్లు రూ.62.75 కోట్లకు చేరినట్లు పేర్కొంది.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528